## క్లుప్తంగా

### యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



అక్రమంగా ఇసుక తరలిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని కొండంపల్లి, శెట్టిపల్లి, గోనిపేట, మరువపల్లి గ్రామాల నుంచి కొందరు ఇసుకాసురులు చెరువు,వంక పరివాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్ ధర రూ.3వేల నుంచి రూ.4వేల వరకు డిమాండ్ మేరకు పెంచుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమ ఇసుక తరలిస్తే చర్యలు చేపట్టేదని, కూటమి ప్రభుత్వం ఇసుకాసురులపై చర్యలు తీసుకోకుండా ఉంది. తహసీల్దార్ శ్రీధర్‌ను ఫోన్‌లో ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

### నేటి నుంచి కాంప్లెక్స్ సమావేశాలు

రొళ్ల: మండల పరిధిలోని హొట్టేబెట్ట, రత్నగిరి, బీజీ హళ్లి ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. అదేవిధంగా బుధవారం అలుపనపల్లి, రొళ్ల, హెచ్‌టీ హళ్లి ఉన్నత పాఠశాల ఆవరణలో కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతాయన్నారు. ఆయా కాంప్లెక్స్‌లో జరిగే సమావేశాకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఒక్కో రోజు సగం మంది (50 శాతం) ఉపాధ్యాయులు మాత్రమే హాజరుకావాలని సూచించారు.

### భక్తిశ్రద్ధలతో అనంత చతుర్దశి

మడకశిర: పట్టణంలో అనంత చతుర్దశి వేడుకలను సోమవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆర్యవైశ్యులు, బ్రహ్మణులు అనంత పద్మనాభ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. మహాగణపతి, నవగ్రహ, నారాయణ వ్రతాలు చేపట్టారు. మహా మంగళారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం చేశారు.

### 160 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

మడకశిర: పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో సోమవారం అమరరాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన టెన్త్, ఇంటర్, ఐటీఐ, పాస్, ఫెయిల్ అయిన నిరుద్యోగులకు జాబ్‌మేళాకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆపరేటర్ పోస్టులకు మొత్తం 160 మంది నిరుద్యోగులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో అమరరాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### నంది విగ్రహం వితరణ



నంది విగ్రహం అందిస్తున్న దృశ్యం

హిందూపురం: ఆటోనగర్ భగీరథ శివాలయంలో కొలువుదీర్చేందుకు రిటైర్డు పీఈటీ ఆశ్వత్తప్ప ప్రత్యేకంగా నంది విగ్రహన్ని తయారు చేయించి ఆలయానికి అందించారని ఉప్పర కమిటీ నాయకులు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ భగీరథ శివాలయంలో అభివృద్ధి పనులు చేపడుతున్నాయని, దాతలు ముందుకు వచ్చి సహకారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రామప్ప, నరసింహప్ప, నారాయణ స్వామి, ఎల్ఐసి కదిరిప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### అమ్మాజీ ఆలయంలో పూజలు



అలంకరణలో అమ్మాజీ దేవత

రొళ్ల: మండల పరిధిలోని జీరిగేపల్లి గ్రామంలో వెలసిన అమ్మాజీ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మారక్క, గ్యారక్క, ముడుపక్కల మూల విగ్రహాలను శుభ్రం చేశారు. తర్వాత వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించి మహామంగళారతి ఇచ్చారు. నియోజకవర్గం వ్యాప్తంగా కాకుండా కర్ణాటక ప్రాంతం బెంగళూరు, తుమకూరు, శిర వంటి పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకుడు మారన్న ప్రసాదం అందించారు. ఆలయ కమిటీ ద్వారా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

---



### పేద విద్యార్థులకు తీవ్ర నష్టం

"గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పెనుకొండకు మెడికల్ కళాశాల మంజూరైంది. పేద పిల్లలకు సౌకర్యంగా ఉంటుందనుకున్నాం. కానీ కొనసాగిస్తే వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మంచిపేరు వస్తుందని కూటమి ప్రభుత్వం కుట్రపన్నుతోంది. వైద్య రంగాన్ని ప్రైవేట్ పరం చేస్తే మధ్యతరగతి పిల్లలు వైద్య విద్య అభ్యసించలేరు. కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– పోలేపల్లి హనుమంతు, సోమందేపల్లి





### విద్యార్థుల ఆశలు అడియాసలు

గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి కొత్తగా మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయించింది. కేంద్ర ప్రభుత్వం ఆ కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లను కేటాయించింది. అయితే ఆ సీట్లను రాష్ట్ర ప్రభుత్వం వద్దనడం చాలా దారుణం. 'నీట్'లో మంచి ర్యాంకులు సాధించిన ఎంతో మంది ఆశలు అడియాసలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రభుత్వ కళాశాలల నిర్వహణను చేపట్టాలి.

– నరసింహామూర్తి, దివ్యాంగుల ట్రైనర్, చిలమత్తూరు"



# ప్రవక్త చూపిన మార్గంలో నడుద్దాం

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మక్కా మసీదు నమూనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ముస్లింలు దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

- ఘనంగా మిలాదున్ నబీ వేడుకలు
- దర్గాల్లో ముస్లింల ప్రార్థనలు



హిందూపురంలో మక్కా, మదీనా నమూనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

హిందూపురం: ప్రతిఒక్కరూ మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని మౌలానాలు షాహీద్ రజా, అబ్దుల్ రజాక్ సాహెబ్ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని సోమవారం పట్టణంలో మిలాదున్ నబీ వేడుకలు ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మేళాపురం జామియా, ముక్కడిపేట గౌసియా మసీదులు, రహమతపురం ఆహాలే సున్నతుల్ జమాత్ కమిటీల ఆధ్వర్యంలో ముస్లింలకు పవిత్రమైన మక్కా మదీనాల నమూనాలు, జెండాలు పట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో ముస్లింలు అల్లాహు అక్బర్, యారసూలల్లాహ్, నారే హైదరియా అలీ యా అలీ అంటూ నినాదాలు చేశారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ప్రార్థన గీతాన్ని ఆలపించి దువా చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మౌలానా, ఆర్‌ఎంఎస్ షఫీవుల్లా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ, సహనం, శాంతితో కలిగి జీవించాలని మహమ్మద్ ప్రవక్త ఆకాంక్షించారన్నారు. కార్యక్రమంలో ముతవల్లీలు రహమతుల్లా సేఠ్, ఫారూఖ్ సేఠ్, సాదిక్ వలి, ఖాజీ అల్లాబక్ష్, మహబూబ్ దౌలా, షబ్బీర్, రఫీక్ సేఠ్, కమిటీ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అమరాపురం: మండలంలో ఈద్ మిలాద్–ఉన్–నబీ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మక్కా, మదీనాల నమూనాలు ఏర్పాటు చేసుకుని స్థానిక జామీయా మసీదు నుంచి ర్యాలీగా వైఎస్సార్ సర్కిల్ వరకు వెళ్లారు. అక్కడి నుంచి బస్టాండ్ వద్దకు చేరుకుని అక్కడ మహమద్ ప్రవక్త సందేశాలను చదివి వినిపించారు. యువత డప్పుచప్పుళ్ల మధ్య పాటలు పాడుతూ సందడి చేశారు. అక్కడి నుంచి జామీయా మసీదుకు చేరుకున్నారు. మహమ్మద్ ప్రవక్త త్యాగనిరతి, సేవాతత్పరత, నీతి, నిజాయితీ, మత బోధనలు ప్రపంచ మానవాళికి ఉపయోగపడుతాయని ముతవల్లీలు తెలిపారు. అలాగే హేమావతిలో మిలాద్–ఉన్–నబీ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.

#### ఆకట్టుకున్న ర్యాలీ..

పావగడ: పట్టణంలోని జామియా మసీదులో మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ఈద్ మిలాద్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం పతాకాన్ని ఆవిష్కరించి, సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం మసీదు నుంచి పెనుగొండ ఊరు వాకిలి ద్వారా ప్రధాన బళ్లారి రోడ్డుకు చేరుకున్నారు. వేలాది మంది ముస్లింలు ర్యాలీలో పాల్గొన్నరు. మక్కా మసీదు నమూనా ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. షాదీ మహల్‌లో మూడు పేద జంటలకు ఉచితంగా వివాహాలు చేశారు. నూతన వధూవరులకు అవసరమైన గృహోపకరణాలు అందించారు.

గుడిబండ: మండల కేంద్రంలో సోమవారం మిలాద్–ఉన్–నబీ సందడి నెలకొంది. పట్టణంలోని మసీద్ వద్ద మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం యువకులు వీధుల్లో జాతీయ జెండాను ఊరేగిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. యువకులు తమ వంతు అల్పాహారం అందిస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ ప్రజలు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెనుకొండ: పట్టణంలో సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లింలు పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. మహమ్మద్ ప్రవక్త శాంతి సందేశాన్ని ఇచ్చారు. కుమ్మరదొడ్డిలోని ఖాజాగరీబ్నున్నవాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. పేదల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, జాలి, క్షమాగుణం ఉండాలని మహమ్మద్ ప్రవక్త బోధించినట్లు ట్రస్ట్ గౌరవాధ్యక్షులు జాబిలి చాంద్ బాషా, ట్రస్టు సభ్యులు తెలిపారు. ర్యాలీలో బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా తదితర ముస్లింలు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



గుడిబండ: జాతీయ జెండాను ఊరేగిస్తున్న ముస్లింలు





పావగడ: ఊరేగింపులో మక్కా మసీదు నమూనా ప్రదర్శన



అమరాపురంలో మక్కా మదీనాల నమూనాను ఊరేగిస్తున్న దృశ్యం



పెనుకొండలో అన్నదానం చేస్తున్న క్వాజా గరీబున్నవాజ్ ట్రస్ట్ సభ్యులు

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ మానుకోండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసే ఆలోచనను మానుకోవాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైద్య విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ప్రారంభించి దేశంలోనే రికార్డ్ సృష్టించారని తెలిపారు. కొత్త మెడికల్ కళాశాలలను ప్రారంభించడంతో సీట్లు పెరిగాయని గుర్తు చేశారు. ఫలితంగా రాష్ట్రంలోని పేద విద్యార్థులు కూడా మెడికల్ సీట్లు సాధించారని పేర్కొన్నారు. వైద్య రంగంలో వైఎస్ జగన్ ఐదేళ్లలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. అయితే ఈ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైద్య రంగాన్ని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. అంతే కాకుండా వైద్య విద్యను కూడా నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ చర్యతో పేదలకు వైద్య విద్యతో పాటు వైద్యం దూరమవుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రారంభించిన మెడికల్ కళాశాలల నిర్మాణాలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలను పూర్తి చేయకుండా ప్రైవేట్ పరం చేయడానికి ప్రయత్నించడం అన్యాయమేని దుయ్యబట్టారు. నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లేకపోతే విద్యార్థులు ప్రభుత్వంపై తిరగబడుతారన్నారు.

## ప్రజలను శాంతి వైపు నడిపించిన గొప్ప వ్యక్తి ప్రవక్త

హిందూపురం టౌన్: ప్రజలు మంచి మార్గంలో నడిచేలా శాంతి సందేశం ఇచ్చిన గొప్ప వ్యక్తి మహమ్మద్ ప్రవక్త అని సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో ఉర్దూ మూలం మౌలానా ఖాలిద్ సైఫుల్లాహ్ రహ్మానీ తెలుగులో అనువాదం చేసిన మహమ్మద్ ప్రవక్త వ్యవహార సరళి పుస్తకాన్ని మైనారిటీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఉబెదుల్లా ఉస్సేన్ అధ్యక్షతన న్యాయమూర్తి తన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో పట్టణ, అప్ గ్రేడ్ స్టేషన్, రూరల్ సీఐలు రాజగోపాల్‌నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు, జనార్దన్‌తో పాటు ఇతర అధికారులు, ప్రముఖులకు పుస్తకంతో పాటు మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిప్పు సుల్తాన్ మానవతా రక్త దాన సంఘం అధ్యక్ష డు షేక్ షబ్బీర్, బిలాల్, ఆమీన్, జామియా సభ్యులు సిరాజ్, ఫ్రూట్ రహమాన్, మాజీ కౌన్సిలర్ జహీర్, జుబేర్, జమీర్, ఫైరోజ్, రి యాజ్ తదితరులు పాల్గొన్నారు.



సీఐలకు పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

## పట్టా భూమిలో రోడ్డు వేయడం తగదు

రొద్దం (పరిగి): మండల కేంద్రం రొద్దం నుంచి కుర్లపల్లికి వెళ్లేందుకు నిర్మిస్తున్న రోడ్డును తన భూమిలో కాకుండా మరో చోట వేయాలని గ్రామానికి చెందిన సుబ్బయ్య కోరుతున్నాడు. ఇటీవల మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు రొద్దం నుంచి కుర్లపల్లికి వెళ్లే రోడ్డు వేయడానికి అనుమతి ఇచ్చారన్నాడు. అయితే రోడ్డు నిర్మిస్తే జీవనాధారంగా ఉన్న తన వ్యవసాయ భూమిలో దాదాపు 75 సెంట్లు కోల్పోతానని ఆవేదన వ్యక్తం చేశాడు. పట్టా భూమిలో పంట సాగు చేసుకుంటున్నానని, రోడ్డు నిర్మిస్తే జీవనాధారం కోల్పోతానని, ఇప్పటికే మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. తన ఆవేదనను పట్టించుకోకుండా రోడ్డు నిర్మిస్తున్నారన్నాడు. తనకు న్యాయం జరగకపోతే న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తానని తెలిపాడు.



వ్యవసాయ పొలంలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

## పరిగి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా నరసింహమూర్తి



పరిగి: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా బొరెడ్డిపల్లి బీకే నరసింహమూర్తిని నియమించినట్లు శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు త్వరలో జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ నిర్దేశాల ఆమోదంతో ప్రతి మండలంలో నూతన నాయకత్వాన్ని పెంపొందించడంతో పాటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నరసింహమూర్తి మాట్లాడుతూ మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులందరినీ కలుపుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తనకు మండల కన్వీనర్‌గా మరోమారు పదవి అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## క్వారీ రద్దు చేయాలని ఆందోళన



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి సమీపంలోని క్వారీ వద్ద పేలుళ్లు జరపకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. సోమవారం బెంగళూరు వెళ్తున్న మంత్రి సవితను జాతీయ రహదారిపై ఆపి, వారు వినతి పత్రం అందించారు. క్వారీతో స్థానికంగా నాగినాయని చెరువు తండా, వెలుగు మాకులపల్లి, పాపిరెడ్డిపల్లి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేజీబీవీతోపాటు చుట్టుపక్కల పొలాల్లో వ్యవసాయం చేసుకునే రైతులు పేలుళ్ల ధాటికి భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ బీలా నాయక్, రైతులు లక్ష్మీనారాయణ రెడ్డి, ఆంజనేయులు, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.



నీలకంఠాపురంలో గణనాథుడిని ఊరేగిస్తున్న దృశ్యం



మడకశిర చెరువు వద్ద వినాయక ప్రతిమకు పూజలు చేస్తున్న సిద్ధగిరి గ్రామ యువకులు

## వెళ్లిరా.. గణపయ్యా

మడకశిర రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో పది రోజుల పాటు పూజలందుకున్న గణపయ్యలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. సిద్ధగిరి ఎస్సీ కాలనీ, నీలకంఠాపురం, నీలకంఠేశ్వర ఆలయంలో కొలువుదీరిన గణనాథులను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్లలో ఊరేగించారు. యువకులు వీధుల్లో రంగులు చల్లుకుంటూ నృత్యం చేస్తూ సందడి చేశారు. అనంతరం వినాయకులకు చెరువుల వద్ద పూజలు చేసి, నిమజ్జనం చేశారు. అర్చకులు భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, గణేష్ కమిటీ సభ్యులు యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నీలకంఠేశ్వర ఆలయం నుంచి వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తున్న భక్తులు

## నేటి నుంచి 'స్వచ్ఛతా హీ సేవా'

లేపాక్షి: మండల వ్యాప్తంగా ప్రతి పంచాయతీలో మంగళవారం నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ శివన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వచ్ఛతా ప్రతిజ్ఞ, మానవహారం, స్వచ్ఛతా పరుగు, సైకిల్ పరుగు, మారథాన్, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛత , అమ్మ పేరుతో ఒక మొక్క నాటడం, చెత్త దిబ్బలను లేకుండా చేసి పరిశుభ్రంగా ఉంచడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## కారు, బైక్ ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

అమరాపురం: మండలంలోని హేమావతి రోడ్డులో మద్దనకుంట క్రాస్ వద్ద కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక రాష్ట్రం టీఎస్.కోటకు చెందిన లక్ష్మన్న, శివన్న.. ద్విచక్ర వాహనంలో అమరాపురం మండలం ఉదుగూరులోని బంధువుల అంత్యక్రియలకు బయలుదేరారు. మద్దనకుంట క్రాస్ వద్ద శివరం నుంచి వస్తున్న కారు.. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఘటనలో శివన్న తీవ్రగాయాలు, లక్ష్మన్నకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్ణాటక రాష్ట్రం తుమకూరుకు తరలించారు.

## కూలీ బిడ్డకు ఎంబీబీఎస్ సీటు



తల్లిదండ్రులతో లక్ష్మీ సంధ్య

అగళి: మండల పరిధిలోని ఆలూడి గ్రామానికి చెందిన కూలీ కాంతరాజు, రత్నమ్మ దంపతుల కుమార్తె లక్ష్మీసంధ్య నీట్ పరీక్షలో సత్తా చాటింది. జాతీయ వైద్య విద్య అర్హత ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో 64,486 ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 1,791 ర్యాంక్ సాధించింది. ప్రభుత్వం ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లు కేటాయిచడంతో తిరుపతి పద్మావతి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు దక్కించుకుంది. తల్లిదండ్రులు, ఆర్డీటీ సంస్థ ప్రోత్సాహంతో తాను ఎంబీబీఎస్ సీటు సాధించినట్లు లక్ష్మీసంధ్య తెలిపింది.

## వంట పాత్రల వితరణ



రూ.6 లక్షల విలువైన వంట పాత్రలు అందజేసిన జపానంద స్వామి

పావగడ: కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంతంలోని ముండక్కై, చూరలమల ప్రాంతాల్లో ఇటీవల వచ్చిన వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న వలు పాఠశాలలను స్థానిక రామకృష్ణాశ్రమాధిపతి జపానంద స్వామిజీ సోమవారం సందర్శించారు. భోజనానికి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా సుమారు రూ.6 లక్షల విలువైన వంట సామగ్రిని పాఠశాలలకు అందజేశారు. సుమారు 2,560 మంది విద్యార్థులకు సరిపడేలా పెద్ద వంట పాత్రలు, గ్యాస్ స్టౌవ్స్, కుక్కర్లు, బిందెలు, బకెట్లు తదితర వంట సామగ్రి సమకూర్చారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్, దేశ్ పాండె ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో వంట సామగ్రి అందజేసినట్లు స్వామిజీ వెల్లడించారు.

## అనంత పద్మనాభ స్వామికి చతుర్థి పూజలు



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని అనంత పద్మనాభ స్వామి ఆలయంలో సోమవారం అనంత చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పద్మనాభ, లక్ష్మీదేవి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి కల్యాణోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉయ్యాల ఉత్సవంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ముత్యపు, పుష్పాలతో పూజలు చేసి కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో ఈఓ నాగేంద్రుడు, అర్చకుడు నాగరాజశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డుకు గాయాలు



గాయపడిన ఆంజనేయులు

పెనుకొండ రూరల్: పెనుకొండ జాతీయ రహదారిపై గుట్టూరు కనుమ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు ఆంజనేయులు గాయపడ్డాడు. వివరాలు.. చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన ఆంజనేయులు గుట్టూరు వద్ద రైల్వే తాత్కాలిక సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజులాగే విధులకు వెళ్తుండగా మార్గంమధ్యలో గుట్టూరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద రోడ్డు దాటే క్రమంలో వెనుక వైపు నుంచి ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనం ద్వారా పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.